క్లుప్తంగా

నింద్ర పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ రవికుమార్

నింద్ర: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను నగరి డీఎస్పీ రవికుమార్ అదివారం తనిఖీ చేశారు. కేసుల వివరాలు, రికార్డులను ఆయన పరిశీలించారు. పలు కేసులపై ఆరా తీశారు. తమిళనాడు సరిహద్దు కావడంతో రాత్రి వేళల్లో నిఘా పెట్టాలని అన్నారు. నగరి రూరల్ సీఐ శ్రీనివాసంతి, ఎస్ఐ శివశంకర్ పాల్గొన్నారు.

కొత్త పెన్షన్లు అందజేత



పెన్షన్లు అందిస్తున్న మాజీ ఎంపీపీ

నగరి: మండలంలోని ముడిపల్లి గ్రామంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను మాజీ ఎంపీపీ జయచంద్రారెడ్డి సచివాలయం వద్ద ఆదివారం లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోవిందయ్య, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే తెరణి గ్రామంలో సర్పంచ్ నిర్మలా డింపుల్ నూతన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో కౌన్సిలర్లు నూతన పెన్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సచివాలయ సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

బహిరంగ సభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఈనెల 8వ తేదీ తిరుపతిలో జరిగే సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మురళి కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆదివారం పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కత్తిరవి, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, నాయకులు శ్రీనివాసులు, షణ్ముగం, గురవయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

పుట్టాలమ్మకు సారె సమర్పణ



సారె అందజేస్తున్న తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: మండలంలోని రామలింగాపురంలో వెలసిన శ్రీగంగమ్మ దేవత సహిత పుట్టాలమ్మ ఆలయ మహాకుంభాభిషేకం సందర్భంగా ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ముక్కంటి సారెను అందజేశారు. ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. వాటిని అమ్మవారికి ధరింపజేసి ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం అంజూరు తారక శ్రీనివాసులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బర్రె హేమభూషణరెడ్డి, మురగయ్య, సుధాకర్, బత్తిరెడ్డి, మించల మనోహర్, శ్రీకాంత్, బత్తెయ్య, కిషోర్, సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్: ఈనెల 7వ తేదీ చిత్తూరుకు చేరుకోనున్న సీపీఐ ప్రజా బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సీపీఐ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. గురువారం సాయంత్రం 3 గంటలకు బస్సు యాత్ర చిత్తూరుకు చేరుకోనుందన్నారు. ప్రజలు జయప్రదం చేయాలని కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కుందన నృత్యాలయ నాట్య గురువు వినుత హేమంత్ ఆధ్వర్యంలో కళాకారులు మోనిక, రమ్య, జెన్నీఫర్, తనుజ, నయన, దివ్య, యశశ్విని, దర్శిని, స్నేహ పలు పాటలకు నృత్యం చేసి ఆకట్టుకున్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- మండల పరిషత్ సాధారణ నిధుల నుంచి రూ. 91.35 లక్షల కేటాయింపు
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.36.65 లక్షలు మంజూరు
- మంత్రి ఆర్‌కే రోజా చొరవతో పుత్తూరు మండలంలో ఊపందుకున్న పనులు

పుత్తూరు రూరల్: మండలంలో జోరుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే పలు పనులు పూర్తి కాగా, మరి కొన్నిచోట్ల పనులు జరుగుతున్నాయి. ఇందులో ప్రధానంగా మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, కల్వర్టులు, తాగునీటి సౌకర్యాలు, కాంపౌండ్ వాల్ నిర్మాణాలు ఉన్నాయి. గోపాలకృష్ణాపురంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.36.65 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువను ఇటీవలే మంత్రి ఆర్‌కే రోజా ప్రారంభించారు. మండలంలో సాధారణ నిధులు రూ.91.35 లక్షలతో 50 రకాల పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి.



నేసనూరులో పూర్తయిన సీసీ డ్రైనేజీ నిర్మాణం



గోపాలకృష్ణాపురంలో సీసీ రోడ్డు నిర్మాణం



రామకృష్ణాపురంలో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు

పుత్తూరు మండలంలో సాధారణ నిధుల ద్వారా మంజూరైన పనులు

పంచాయతీ	మంజూరైన పనుల వివరాలు	పనుల సంఖ్య	అంచనా మొత్తం (రూ.లక్షల్లో)
గోపాలకృష్ణాపురం	రోడ్లు, కాలువలు	17	26.05
వేపగుంట	సచివాలయ భవనం, కాలువలు	12	21.90
రామకృష్ణాపురం	తాగునీటి సౌకర్యం, కాలువలు	5	6.60
నేసనూరు	కల్వర్టు, కాలువలు	11	24.80
కేబీఆర్‌పురం	పైపులైను పనులు	3	7.50
మండల పరిషత్ కార్యాలయంలో రిపేర్లు	కాంపౌండ్ వాల్, ఇతర మరమ్మతులు	2	4.50
మొత్తం		50	91.35

ఘనంగా మహాకుంభాభిషేకం

వెదురుకుప్పం: శ్రీ వరసిద్ధ వినాయక స్వామి మహాకుంభాభిషేకం యనమలమంద పంచాయతీ గంగిరెడ్డి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కామసాని పద్మనాభిరెడ్డి హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ సిబ్బంది ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేపట్టారు. స్వామివారి దర్శనానంతరం ఆలయానికి పది వేల నూట పదహార్లను ఆర్థిక సహాయంగా అందజేశారు. అలాగే దిగువ పల్లాలు గ్రామంలో నిర్మిస్తున్న గ్రానైట్ క్వారీ వారి ద్వారా రూ.70,016 అందించారు. అనంతరం ఆలయ సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు. చివరగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కామసాని పద్మనాభిరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నగరి: మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 26వ వార్డు గాండ్ల వీధి (జనరల్), చిదంబరనగర్ 2,3వ వీధి (జనరల్), 28, 29 వార్డులకు చెందిన ధర్మరాజు గుడి వీధి ఉత్తరం, బజారువీధి తూర్పు (బీసీ రుబీ మహిళ), 1వ వార్డు పాండురాజుపురం, రాజీవ్‌నగర్ (జనరల్), 4వ వార్డు ఎస్‌వీ నగర్, ఎస్‌ఆర్ నగర్ (ఎస్సీ మహిళ), 12వ వార్డు మొదటి బీటీఎం వీధి, రాజీవ్‌గాంధీ వీధి (జనరల్), అన్నామెయిన్ రోడ్డు (జనరల్ మహిళ), మూడవ బీటీఎం వీధి (జనరల్), ఇందిరానగర్-1 (బీసీ-ఈ), 20వ వార్డు ఈశ్వరగుడి వీధి ఉత్తరం, ఎల్లమ్మ గుడి వీధి (ఎస్సీ), 18, 19వ వార్డుకు చెందిన పళ్లిపట్టు మెయిన్ రోడ్డు దక్షిణం (బీసీ మహిళ), పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి, ఆపై విద్యార్హత కలిగి, వయసు 18 నుంచి 35లోపు ఉన్నవారు ఈ నెల 6వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. 11, 12 తేదీల్లో ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. 13వ తేదీలోపు ఎంపిక చేసిన వలంటీర్లకు సమాచారం అందుతుందని, 14వ తేదీ నుంచి ఎంపికైన వలంటర్లీకు బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

ముగిసిన కొలుపు



పుర వీధుల్లో అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో శ్రీకానగలమ్మ

కార్వేటినగరం: మండల కేంద్రంలోని శివాలయం వీధిలో వెలసిన శ్రీకానగలమ్మ కొలుపు ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనమతించారు. మధ్యాహ్నం హరికథా కాలక్షేపం భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రి అమ్మవారికి ఉభయదారులు సారె సమర్పించారు. విశేష అలంకరణలతో శ్రీకానగలమ్మ ప్రత్యేక వాహనంపై ఊరేగుతూ కనువిందుచేశారు.

పురవీధుల్లో విహరిస్తున్న అర్జునస్వామి



పురవీధుల్లో విహరిస్తున్న ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి

పుత్తూరు రూరల్: ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి ఆదివారం పట్టణ పురవీధుల్లో విహరించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల అనంతరం మూడవ ఆదివారం ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలి రెండు ఆదివారాల్లో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషకాలు, పూజలు నిర్వహించి, పురవీధుల్లో ఊరేగించడం ఆనవాయితీ. ఇందులోభాగంగా తొలి ఆదివారం సాయంత్రం జరిగిన ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్ పర్యవేక్షించారు.

పల్లికొండేశ్వరుని సేవలో నటుడు పొన్నాంబలం

నాగలాపురం: సురుటుపల్లిలో వెలసిన శ్రీ పళ్లికొండేశ్వర స్వామివారి ఆలయాన్ని ఆదివారం ప్రముఖ తమిళ నటుడు పొన్నాంబలం సందర్శించారు. పొన్నాంబలం ఇటు తెలుగు అటు తమిళ సినీరంగంలో హిట్లర్, ముతామేస్త్రి, నరసింహుడు, ముత్తు వంటి పలు సినిమాల్లో నటించారు. వీరికి ఆలయ చైర్మన్ ఏవీఎం మునిచంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికి స్వామి, అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు.



పొన్నాంబలానికి ప్రసాదాలు ఇస్తున్న నిర్వాహకులు

వైద్యశిబిరానికి విశేష స్పందన

నింద్ర: కావనూరు గ్రామంలో ఆదివారం తిరుపతికి చెందిన సన్‌ప్రైమ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వారిచే ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో పలువురికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యులు మహేష్‌రెడ్డి, పూర్ణగణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కండలేరులో 14.014 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 14.014టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 845 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 40, లోలెవల్ స్లూయిజ్‌కు 80, క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

టీడీపీలోనే దళితులకు అవమానం

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు టీడీపీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ థామస్‌కు ప్రజాసేవ ఇప్పుడు గుర్తుకొచ్చిందా ? అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి కాలప్ప అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దళితులకు పెద్దపీట వేసి అందరితో సమానంగా రాజకీయ సమానత్వం తీసుకువచ్చి, వారి అభివృద్ధికి కృషి చేస్తుంటే, వాటిని జీర్ణించుకోలేని చంద్రబాబు దళితులను అణగతొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన దళిత వర్గాలకు చెందిన కళత్తూరు నారాయణస్వామిని జిల్లా అధ్యక్షుడిగా, తరువాత ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా అవకాశం కల్పించారని తెలిపారు. అలాగే పాదయాత్ర సమయంలో ఫిజియోథెరపిస్ట్‌గా సేవలు అందించిన గురుమూర్తిని తిరుపతి ఎంపీగా, పార్టీ కార్యకర్తగా పనిచేసిన రెడ్డెప్పను చిత్తూరు ఎంపీగా, సొంత ఇల్లు కూడా లేని ఆదిమూలంను సత్యవేడు ఎమ్మెల్యేగా, పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా ఉన్న ఎంఎస్ బాబును పూతలపట్టు ఎమ్మెల్యేని చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అదే చంద్రబాబు నాయుడు గతంలో తన సామాజిక వర్గానికి చెందిన చిట్టిబాబు నాయుడుని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించి, దళితులను అవమానించడంతో పాటు అణగతొక్కే ప్రయత్నం చేశారన్నారు. దళితుల నుంచి వ్యతిరేకత రావడంతో తొలి నుంచి టీడీపీ కోసం కష్టపడిన దళితులను కాదని, చెన్నైలో ఉన్న డాక్టర్ థామస్ నుంచి ముడుపులు అందుకుని గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పజెప్పడం ద్వారా దళితులపై చంద్రబాబుకు ఉన్న కపట ప్రేమ అర్థం అవుతోందన్నారు. టీడీపీలో ఉన్న దళితులు వెంటనే ఆ పార్టీని వీడి దళితుల అభివృద్ధికి కృషి చేసే వైఎస్సార్‌సీపీని ఆదరించాలన్నారు. దళితుల అభివృద్ధి కోసం జగనన్న విప్లవాత్మకమైన జగనన్న విదేశీ విద్యాదీవెన, కార్పొరేట్ కళాశాలలో 25 శాతం దళిత విద్యార్థులకు ఉచిత విద్య, ప్రజాప్రతినిధుల్లో 50 శాతం వెనుకబడిన తరగతుల వారికి, ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం, నిరుపేదలకు సొంతింటి కల వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జ్ థామస్, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు దళితులకు ఏమి చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో దళితులంతా ఏకమై టీడీపీని భూస్థాపితం చేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మణి, తయ్యూరు మాజీ సర్పంచ్ బాబు, నాయకులు మహేష్, అమృతరాజ్, ఏకాంబరం, కటికపల్లి మణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి కాలప్ప

కనులపండువగా మహాకుంభాభిషేకం



కలశాన్ని ప్రతిష్టిస్తున్న వేదపండితులు

వెదురుకుప్పం: మండలంలోని ముసలయ్యగారిపల్లిలో వెలసిన గంగమ్మతల్లి మహాకుంభాభిషేకాన్ని ఆలయ సిబ్బంది మినిరాజులురెడ్డి, వెంకటేష్, రామూర్తి ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. ఈ మహాకుంభాభిషేకానికి ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆయనకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం అర్చకులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠంచారు. భక్తులకు అన్నదానం నిర్వహించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

స్వర్ణరథంపై శివపుత్రుని కటాక్షం



స్వర్ణరథంపై విహరిస్తున్న గణనాథుడు



స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ అధికారులు



దర్శనానికి క్యూలో వేచివున్న భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆదివారం రాత్రి స్వర్ణ రథంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. సంకటహర చతుర్థి గణపతి వ్రతం సందర్భంగా ఆలయంలోని ఆస్థాన మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామిని కొలువు తీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ అధికారులు, ఉభయదారులు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చి బంగారు రథంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో నిండిపోయిన క్యూలు

భక్తులతో పోటెత్తిన ఆలయం

కాణిపాకం ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సెలవు రోజు, సంకటహర చతుర్థి గణపతి వ్రతం కావడంతో వేల సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో కంపార్ట్‌మెంట్లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. ఆలయం వెలుపుల వరకు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు చర్యలు తీసుకున్నారు. గర్భిణులు, వయో వృద్ధులు, దివ్యాంగులు, చంటి బిడ్డల తల్లిదండ్రులను ప్రత్యేక క్యూల నుంచి స్వామివారి దర్శనం కల్పించారు.

కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవంలో మంత్రి రోజా



నగరి: నగరి మున్సిపాలిటీ దేశమ్మ గుడి సమీపంలో నూతనంగా నిర్మించిన ప్రైవేట్ కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఆమె వెంట నగరి మున్సిపాలిటీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు ఉన్నారు.